# సనాతన ధర్మం ఇస్లాం



ఉమర్

మనం మనుషులం. అందరం సమానులం. అస్పృశ్యతా అంటరాని తనాలకు అతీతులం. దైవ దాసులం. ఆది మానవుడైన ఆదం (అ) వారి బిడ్డలం. ఒకే కుటుంబానికి చెందినవారలం. మనల్ని పుట్టించిన దేవుడు మనందరి మార్గదర్శక నిమిత్తం ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది ప్రవక్తలను ప్రభవింపజేయడమేగాక, అనేక గ్రంథాలను అవతరింపజేశాడు. అలా లోక కళ్యాణార్థం వచ్చిన మహా మహులలో మొదటివారు ఆదమ్ (అ). ఆయన మొదలు ప్రవక్తలందరూ తీసుకొచ్చిన ధర్మం ఒక్కటే. అది "లా ఇలాహ ఇల్లల్లాహ్" - దేవుడు ఒక్కడే. అదే నిజం. తక్కినవన్నీ మిథ్య. దేవుడు ప్రజలందరికీ ఉపదేశించిన జీవన విధానం ఒక్కటే. అగ్ర వర్ణాల వారికీ, అధమ వర్ణాల వారికీ అంటూ వేర్వేరు శాసనాలు ఆయన చేయలేదు. ధనికులైనా, పేదలైనా, అరబ్బులైనా, అరబ్బేతరులైనా, నల్లవారైనా, తెల్లవారైనా, కనక పిపాసులైనా, కార్మికులైనా అందరి కోసం ఆయన నిర్దేశించిన జీవన విధానం ఒక్కటే. నాటి నుండి నేటి వరకు. అదే ఇస్లాం.

ఇస్లాం చూపే జీవన విధానం అన్ని దేశాలకు, అన్ని కాలాలకు అన్ని విధాల ఆమోదయోగ్యంగా ఉంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అది ముందు మనిషి, నిజ స్వామిని గుర్తించాలంటుంది. ఆయన ప్రసన్నతను కోరుతూనే ప్రతి పని చెయ్యాలంటుంది. తల్లిదండ్రుల్ని గౌరవించమంటుంది. వారితో కసురుకుంటూ మాట్లాడకూడదంటుంది. పొరుగువారితో మంచిగా మసలుకోమంటుంది. కుడి ఎడమల ఉన్న నలభై ఇళ్ళు పొరుగువారి క్రిందికి వస్తాయి అంటుంది. తాను పుష్టిగా భోంచేసి పొరుగువాడు ఆకలితో అలమటిస్తూ ఉంటే అతను పరిపూర్ణ విశ్వాసి కాజాలడు అని హెచ్చరిస్తుంది. ఇస్లాం శుచీ శుభ్రతల గురించి నొక్కి మరీ చెబుతుంది. దేహ పరిశుభ్రత విశ్వాసంలోని సగ భాగమైతే, ఆత్మ పరిశుద్ధత విశ్వాసంలోని మరో సగ భాగం అంటుంది.

ఇన్ని చెబుతున్న నేనెవర్ని? అని తెల్లబోతున్నారా? నా పేరు పడిగ పాలేటి. నేను 2006లో ఇస్లాం ధర్మాన్ని ఆశ్రయించాను. తోటి స్నేహితులు, మరియు అన్య పుస్తకాల నుండి ఇస్లాంను గ్రహించిన నేను ఇస్లాం అది ధర్మం అని గ్రహించాను. విశ్వ మానవాళి కోసం విశ్వకర్త పంపిన జీవన విధానం అని తెలుసుకున్నాను. భాష, ప్రాంతం, దేశం, కాలం వేరయినా అందరూ తీసుకొచ్చిన ధర్మం ఇస్లాం మాత్రమే అని తెలుసుకున్న నేను ఇస్లాం స్వీకరించాను. నేను ఇస్లాం ధర్మాన్ని నా జీవన విధానంగా చేసుకున్నప్పటి నుండి నాలో అనూహ్య రీతిలో మార్పు వచ్చింది. మంచి ఏది, చెడు ఏది అని బాగా ఆలోచించి నిర్ణయం తీసుకునే గుణం అలవడింది. ఒక్క మాటలో చెప్పాలంటే - "మంచికి మారు పేరే ఇస్లాం". ప్రస్తుతం నా పేరు ఉమర్.

Abdul Aziz

# మీ ప్రభు వైపునకు మరలండి

తల్లి దండ్రులు, బంధుమిత్రులు, పొరుగువారు, అతిథుల పట్ల సద్వ్యవహారం కలిగి ఉండండి. ఒకవేళ జనాలు మీకు ఏ విధమైనటువంటి ఇబ్బంది కలిగించినా మన్నింపుల వైఖరిని అవలంభించండి. అసభ్యంగా వ్యవహరిస్తే హుందాగా సలాం చేసి తప్పుకోండి. ఎట్టి స్థితిలోనూ ఎవ్వరితోనూ కయ్యానికి కాలు దువ్వకండి. సిగ్గుమాలిన పోకడల జోలికి వెళ్ళకండి. సారాయి, జూదం, వ్యభిచారం, పాచికల జోస్యం సమాజాన్ని భ్రష్టు పట్టించే, సంసారాన్ని నట్టేట ముంచే మహా భయంకర వ్యసనాలు. వీటికి దూరంగా మసలుకోండి. ఇదంతా ఎక్కడ నేర్చుకుని చెబుతున్నారు? అంటారా–; ఇస్లాం ధర్మం నాకు నేర్పిన నైతిక విధానం ఇది. ఇది అన్ని మతాల్లో ఉన్న అంశాలే కదా అని మీరు అనవచ్చు. నిజమే–, కానీ ఇస్లాంలో ఇలాంటి సమాజానికి పనికివచ్చే హితోక్తులు పరిపూర్ణంగా ఉన్నాయి అని నేనంటాను.

ఒకప్పుడు నేనూ అందరిలా ఇస్లాం అంటే ఒక ప్రాంతానికి, భాషకి సంబంధించిన మతం అని, అల్లాహ్ అంటే కేవలం ముస్లింల దేవుడని, ఖుర్ఆన్ అంటే ఏదో కొద్దిమంది మత విశ్వాసాలకు సంబంధించిన గ్రంథమని, మహా ప్రవక్త ముహమ్మద్ అంటే అరబ్బు ప్రాంతానికి పరిమితమైన ప్రవక్త అని, చివరికి ముస్లిలు అంటే మహమ్మదీయులని (ముహమ్మద్ ప్రవక్తను ఆరాధించేవాళ్ళని) అనుకునేవాణ్ణి, కానీ నా అభిప్రాయం తప్పని పుస్తకాలు చదివిన మీదట తెలిసింది. మహా ప్రవక్త (స) వారి జీవిత చరిత్ర ద్వారా మనిషి ఎలా జీవించాలో తెలుసుకున్న నేను, ఖుర్ఆన్ గ్రంథ పారాయణం ద్వారా జీవితం - జీవితంలోని కష్ట సుఖాలు, మరణం–మరణం తర్వాతి జీవితం పరలోకం, తీర్పు దినం, స్వర్గం, నరకం మొదలైనవి గ్రహించగలిగాను.

'తమ పాపాలపై పశ్చాత్తాపం చెందేవారిని పరిశుద్ధతను, పరిశుభ్రతను పాటించేవారిని అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు". (అల్ బఖరా: 222) అన్న మోక్ష సౌరభాలు నిండిన శుభవార్త ఖుర్ఆన్ లోనిదే. ఇస్లాం కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలో కూడా నేర్పుతుంది అంటే మీరు నమ్ముతారా? చూడండి!

1) మరుగుదొడ్డికి వెళ్ళేటప్పుడు ముందు ఎడమ కాలు పెట్టి లోనికి ప్రవేశిస్తూ "అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మినల్ ఖుబుసి వల్ ఖబాయిస్" అనాలి.
2) నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లోగానీ, నీడనిచ్చే చెట్ల క్రిందగానీ, జనులు నడిచివెళ్ళే రహదారుల్లోగానీ, మల మూత్ర విసర్జన చేయకూడదు.
3) పిడకలతో, ఎముకలతో ఇస్తిన్జా చేయకూడదు. అలాగే రంధ్రాల్లో, బిలముల్లో మూత్రం పోయకూడదు.
4) మైదాన ప్రదేశాల్లో కాలకృత్యాలకై వెళితే ఏదైనా వస్తువు తెరగా పెట్టుకోవాలి.
5) అనివార్య పరిస్థితిలో తప్ప ఎప్పుడూ మూత్ర విసర్జన కూర్చొనే చేయాలి.

చూశారుగా ఇస్లాం చూపే జీవన సంవిధానం. త్వరపడండి. నిజ ధర్మమేదో తెలుసుకోండి. మీ ప్రభు వైపునకు మరలిపోండి. ఆయన ప్రసన్నతను చూరగొని స్వర్గవనాలలో హాయిగా విహరించండి.